# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## చింతలేని జీవితం గడుపుతున్నం..



కరెంటు సరఫరా సరిగా ఉండడంతో ప్రస్తుతం చింతలేకుండా జీవిస్తున్నాము. మాది పెద్ద కుటుంబం. అందరం వ్యవసాయం మీదే ఆధారపడేటోళ్లం. తెలంగాణరాక ముందు వ్యవసాయం చేయాలంటే ఎన్నో సమస్యలుండేవి. వ్యవసాయం చేయాలంటే ఎన్నో ఇబ్బందులు. ఎవరికన్నా చెప్పుకుందామంటే వాళ్లది కూడా మాలాంటి కథే. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కుటుంబాలకు బెంగ దూరమైంది. ఎందుకంటే వ్యవసాయంలో అతి ముఖ్యమైనది పొలాలకు నీరు. అవికావాలంటే కరెంటు కావాలి. కరెంటు లేకపోతే ఏ పనీ కాదు. అప్పట్లో ఇతర పనులు చూసుకుంటూ ఉన్నాకానీ, ఒకరు మాత్రం పొలం దగ్గర కాపలా ఉండాల్సి వచ్చేది. కరెంటు ఎప్పుడొస్తదో తెలిసేది కాదు. వచ్చిన తర్వాత మోటర్ పెడితే నీరు కొంచెం దిగువకు పోయేసరికి కరెంటు పోయేది. నీరు ఆగేవి. ఇట్లా చాలా ఇబ్బందులు పడేటోళ్లం, ఎంతో బాధగా ఉండేది. సీఎం కేసీఆర్ సారుకు వ్యవసాయం అంటే మంచి ఆలోచన ఉంది. దాంతో ఆయన బాగా ఆలోచించి పొలాలకు నీటి కోసం ఫుల్‌గా కరెంటు ఇచ్చే నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా బెంగ తీరింది. కరెంటు 24గంటలు ఉంటున్నది. పొలం మొత్తం తడుస్తున్నది. హాయిగా ఇష్టమొచ్చిన సమయంలో పనులు చేసుకుంటున్నాం. మా మద్దతు బీఆర్ఎస్ పార్టీకే.

**– ఎడ్ల వెంకటరెడ్డి, సారెకల్లు, పాల్వంచరూరల్**

## ధరణి మేలు మరువలేనిది..



ధరణి వల్ల నాకు తెలిసినంత వరకు చాలామందికి మేలు జరిగింది. మా తాతల కాలంలో పొలాలకు సంబంధించిన లెక్కలన్ని పుస్తకాల్లో రాసి అవి మడిచి పెట్టేటోళ్ళట. అవి మనకు కావాలంటే నానా తిప్పలు పడాల్సి వచ్చేది. కొన్నిసార్లు మన అవసరాల కోసం పొలాల వివరాలు తెలుసుకునేందుకు నేను మా నాన్నతో కలిసి సర్పంచులు, కరణం వాళ్ల దగ్గరికెళితే కొందరు వింతగా చూసేవాళ్లు. వీళ్లకు ఇప్పుడేం అవసరమొచ్చిందని.. చివరికి ఆ పుస్తకంలో కొన్ని చోట్ల పేజీలు చినిగిపోయి, నలిగిపోయి, అక్కడక్కడా ఇంకుమరకలతోపాటు దిద్దుబాట్లు ఉండేవి. వాటి గురించి అడిగితే సరైన సమాధానం దొరికేదికాదు.. పెద్దోళ్లు చెప్పిన గుర్తులను బట్టి అక్కడున్నది నా పొలం అనుకునేవాళ్లం. కానీ కేసీఆర్ సారు వచ్చింతర్వాత భూముల లెక్కలన్ని పక్కాగా ఉండాలన్నట్టు ధరణిని ఏర్పాటు చేశారు. ధరణి ఏర్పాటుతో ఊపిరిపీల్చుకున్నం. నాకు సంబంధించిన అన్ని వివరాలతో ధరణి పుస్తకాలు ఇవ్వడంతో చాలా సంతోషం వేసింది. ఆ పుస్తకాల్లో నా భూమి ఎంత, మా నాన్న భూమి ఎంత, అది ఎక్కడ ఉంది అన్న పూర్తి వివరాలు కంప్యూటర్ బొమ్మతో చూపిస్తుంటుంది. దీంతో ఎటువంటి సమస్య ఉండేది కాదు. ఎవరడిగినా నా పొలం ఫలానా చోటఉంది అని ధైర్యంగా చెబుతున్నాం. లోన్లు కావాలన్నా ధైర్యంగా తీసుకుంటున్నం. కాంగ్రెసోళ్లు వస్తే మాత్రం మళ్లీ పాతరోజులొస్తాయి.

**– అజ్మీరా జగదీశ్, కోడిపుంజులవాగు, పాల్వంచ రూరల్**

## కాంగ్రెసోళ్లకు అవగాహన లేదు



కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయంపై అవగాహన లేక మూడుగంటల కరెంట్ సరిపోతుందని చెబుతున్నారు. రైతులు 10 హెచ్‌పీ మోటరు అమర్చుకోవడం కష్టం అవుతుంది. అయినా ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పని చేయవు. 24గంటల కరెంట్ ఇస్తేనే రైతులకు సరిపోతుంది. మూడు గంటల కరెంట్ ఇస్తే ఒక ట్రాన్స్‌ఫార్మర్‌పై పది మంది వరకు రైతులు ఉంటే వాళ్లందరూ ఎలా నీళ్లు కట్టడానికి వీలుంటుంది. ఇది నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర. రైతులను మళ్లీ దగా చేయడానికి ఆడుతున్న నాటకాలు. తెలంగాణ ప్రభుత్వం ద్వారానే రైతులకు మేలు కలుగుతుంది. ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇస్తున్న వారికే మా మద్దతు.

**– మొగరం శివ, రైతు, రుద్రంపూర్**

## డేరింగ్ సీఎం కేసీఆర్



రోజుకు 24 గంటలు కరెంటు కోత లేకుండా ఇచ్చిన రాష్ట్రాలు దేశంలోనే లేవు. రాష్ట్రంలో కరోనా మహమ్మారి తాండవించిన కూడా నిరంతర కరెంటును సరఫరా చేశారు. ఆర్థికంగా నష్టాలను ఎదుర్కొంటూ ప్రజలు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా పరిపాలన కొనసాగించారు. నేను నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాను. నేను కౌలుకు తీసుకున్నప్పటి నుంచి కరెంటు కోత లేదు. మోటర్లు బాగానే పని చేస్తున్నాయి. పండగలా వ్యవసాయం చేసుకునేందుకు ఉచిత కరెంటును అందిస్తున్న గొప్ప నాయకుడు కేసీఆర్. కరెంటు కోతలతో ఉన్న తెలంగాణను ఉజ్వల తెలంగాణగా మార్చిన తరువాత మళ్లీ ఇతర పార్టీలకు ఓటు వేసి అంధకారంగా మార్చుకోలేం. నా ఓటు కారుకే. కేసీఆరే ముఖ్యమంత్రి.

**– మంగ, రైతు, నెహ్రూనగర్ గ్రామం, ఒడ్డుగూడెం పంచాయతీ, ఇల్లెందు**

## 10 హెచ్‌పీ మోటర్లంటే బురద కూడా బయటికొస్తది..



కాంగ్రెసోళ్లు వాళ్ల బతుకుదెరువు కోసం మాలాంటి రైతుల బతుకులను ఆగం చేస్తున్నారు. మూడు గంటల కరెంటని, 10 హెచ్‌పీ మోటర్లని ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నరు. అయినా అంత పెద్ద మోటర్ల అవసరం రైతులకు ఏమీ ఉండదు. అలాంటి మోటర్లు ఐదు నిమిషాల్లోనే మొత్తం నీళ్లను లాగేస్తయి. బోరులో ఉన్న ఊట, బురద మొత్తం బయటపడతయి. దీంతో మోటర్లు కూడా కాలిపోతయి. కేవలం అధికారం కోసమే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నరని మాలాంటి రైతులందరికీ తెలుసు. వాళ్లయన్నీ ఆపద మొక్కుల మాటలే. అయినా ఇప్పుడేం తక్కువైంది. 24 గంటల కరెంటొస్తంది. మోటర్లు మంచిగ నడుస్తున్నయి. పంటలు బాగా పండుతున్నయి. వాటి పొలం దగ్గరనే అమ్ముకుంటున్నం. వారం రోజులు కాకముందే ఆ డబ్బులు బ్యాంకుల ఎకౌంట్ల పడతన్నయి. ఇంత సక్కటి సౌలత్‌లు ఉండంగ మళ్లీ కాంగ్రెసోళ్లొచ్చి ఏదో చేస్తరట. వాళ్లున్నప్పుడు పడ్డ కరెంటు కష్టాలను ఇప్పుడిప్పుడే మర్చిపోతున్నం. ఇంతలో వాళ్లే వచ్చి వాటిని గుర్తుకు చేస్తున్నరు. కేసీఆర్ సార్ ఉండంగ కాంగ్రెసోళ్లతో అక్కరే లేదు.

**–వీరబోయిన రాములు, రైతు, బొజ్జాయిగూడెం, ఇల్లెందు**

## తిరిగే బాధలు తప్పాయి



గతంలో భూమి వివరాలు నమోదు చేయించుకోవాలంటే కాళ్లరిగేలా తహసీల్దార్ కార్యాలయానికి తిరిగేవాళ్లం. మా తాత, ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్నాం. కానీ పరిపాలన ఇంత సౌలభ్యంగా, సౌకర్యంగా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తులు రెండింటికి ధరణి పోర్టల్ ఎంతో లాభకారి. ధరణి వచ్చిన తరువాత ల్యాండ్ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ గంటల్లో జరిగిపోతున్నాయి. భూ యజమానుల పాత పాస్‌బుక్‌ను అప్‌డేట్ చేసి కొనుగోలుదారుడికి కొత్తపాస్‌బుక్‌ను ఇస్తున్నారు. వ్యవసాయేతర భూములకు మెరూన్ రంగు పాస్‌బుక్, వ్యవసాయ భూములకు గ్రీన్ రంగు పాస్‌బుక్‌లు జారీ చేస్తున్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ కోసం గతంలో గంటల తరబడి సమయం పట్టేది. ప్రస్తుతం ధరణితో ఆ బాధలు తప్పాయి. మళ్లీ కేసీఆర్ సారు ముఖ్యమంత్రి కావాలి. బీఆర్ఎస్‌కే మా మద్దతు.


**– అజ్మీర శాంతి, బద్రుతండా, పోలారం పంచాయతీ, ఇల్లెందు మండలం**

## ధరణితో రైతుల జీవితాలు కుదుటపడ్డాయి



ధరణి వచ్చిన తర్వాతనే రైతుల జీవితాలు కుదుటపడ్డాయి. తమ భూములకు వచ్చిన ఢోకా ఏమీ లేదని గుండెపై చేయి వేసుకుని హాయిగా నిద్ర పోగలుగుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారి కష్టాలను తీర్చేందుకు ధరణి పోర్టల్‌కు రూపకల్పన చేయడం రైతులకు వరంగా మారింది. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను ఒకే చోట పొందుపరిచి, భూముల నిర్వహణ అధికారుల చేతుల్లో నుంచి తీసివేయడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు పోయాయి. రైతులు వచ్చి వేలి ముద్ర వేస్తేగానీ భూమి పట్టా మార్పిడి జరగని పరిస్థితి తీసుకువచ్చిన కేసీఆర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా రైతు బంధు, రైతు భీమా, పంట కొనుగోళ్లు వంటి ఇతర ప్రయోజనాలు కూడా రైతులకు కలిసొచ్చాయి. కాంగ్రెస్ హయాంలో అధికారులతో ఇబ్బందులు వచ్చేవి. డబ్బులిస్తే ఒకరి భూమి మరొకరి పేరు మీద మార్చేసేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి తీసుకువచ్చి భూములకు భద్రత కల్పించారు. మా మద్దతు బీఆర్ఎస్‌కే.

**– మామిడిపల్లి సీతారాములు, కొండాయిగూడెం, మణుగూరు మండలం**



- నాడు ఏడు గంటల కరెంట్‌తో ముప్పతిప్పలు పడ్డం..
- మడి తడవక.. పంట చేతికి రాక అప్పుల పాలైనం..
- గెట్టు తగాదాలతో ఆగమాగమైనం..
- భూమిని కాపాడుకునేందుకు రక్తం చిందించినం..
- తెలంగాణ వచ్చినంకనే కరెంట్ కష్టాలు తీరినయ్..
- 'ధరణి'తోనే మాభూములు భద్రంగా ఉన్నయ్..
- కాంగ్రెసోళ్లపై అన్నదాతల ఫైర్..

# కాంగ్రెస్ వస్తే తెల్లార్లు జాగారం

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ) : సాగుభూమిలో నాగలిపట్టి.. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు తెలుస్తుంది కష్టమంటే. ఖద్దరు చొక్కాలేసుకొని పొలం గట్లపై కూర్చొని మాట్లాడే కాంగ్రెసోళ్లకు ఏం తెలుసు వ్యవసాయమంటే. విత్తు నాటినప్పటి నుంచి వడ్ల గింజలు ఇంటికి చేరే వరకు రైతు ఎంత యాతన పడుతాడో చెమటోడ్చినోళ్లకే తెలుసు. సాగు షురూ కావాలంటే నీటితోనే పని.. బావులున్నా, బోర్లున్నా కరెంటుతోనే తతంగమంతా ముడిపడి ఉంది. మునుపు కాంగ్రెసోళ్లు కరెంటిచ్చినప్పుడు పంటకు గ్యారెంటీ లేదు. వేళాపాళా లేని కోతలు.. కరెంటు వచ్చినా లో వోల్టేజీ సమస్యలు.. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం.. మోటరు పెట్టగానే మడి తడవకముందే మళ్లీ కరెంటుపోవడం నిత్యకృత్యం. కంటిమీద కునుకు లేకుండా రైతులు పొలాలకాన్నే జాగారాలు.. చీకట్లో పాములు, విషపురుగులు కరిచినా దిక్కులేని పరిస్థితులు. ఆనాటి కరెంటుతో ఎకరం పొలం తడవాలంటే రోజులతరబడి పంట పొలాలకాన్నే పడిగాపులు. కానీ.. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ పాలనలో అంతా మారింది. 24 గంటలు ఇస్తున్న ఉచిత విద్యుత్‌తో రైతులు రెండు పంటలు సంబురంగా పండించుకుంటున్నరు. ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతుల భూములకు రక్షణ కల్పించింది తెలంగాణ ప్రభుత్వం. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్లను సులభతరం చేసింది. దీనిపై కన్నుకుట్టిన కాంగ్రెసోళ్లు మళ్లీ పాత పాట పాడుతున్నరు. మూడు గంటల కరెంటుతో రైతులను ముప్పతిప్పలు పెడతామని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని, ధరణి స్థానే భూమాతను తెస్తామని అవగాహన, పొంతన లేని మాటలు మాట్లాడుతున్నరు. ఇది నచ్చని రైతాంగం కాంగ్రెసోళ్ల తీరుపై కన్నెర్రజేస్తోంది. అవగాహన లేని నాయకుల మాటలు నమ్మితే నట్టేట మునుగుతామని ముక్తకంఠంతో నినదిస్తున్నది. రైతులను పక్షాన నిలిచిన బీఆర్ఎస్‌కే మా మద్దతు అంటూ నొక్కి చెబుతున్నది.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే



ఉచితంగా కరెంటుతో పంటలను మంచి పండించుకుంటున్నాం. కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్ ఇస్తే ఎకరం పొలం కూడా నీరు పారదు. 10 హెచ్‌పీ మోటరు వేస్తే బోరు నుంచి నీళ్లు సరిగ్గా రావు. నీటి ఊటలు తగ్గి.. మోటర్లు కాలిపోతాయి. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే. రైతులను రాజు చేస్తున్నది సీఎం కేసీఆర్ సార్. మేమంతా బీఆర్ఎస్ పార్టీకే ఓట్లేస్తాం, కేసీఆర్ సార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాం.

**–పూనెం మల్లేష్, దొంగతోగు గ్రామం, ఆళ్ళపల్లి మండలం**

## 'భూమాత'తో రైతు మళ్లీ పాతాళానికి



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తొలగిస్తామని అనడం చాలా దారుణం. ధరణి వల్లనే రైతులకు మేలు జరుగుతున్నది, ధరణిని దానిస్థానంలో భూమాత తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం. భూమాతతో రైతు మళ్లీ పాతాళానికి పడిపోవడం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పడ్డ గోస అందరికీ తెలుసు. గ్యారెంటీ స్కీముల పేరుతో ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ కుయుక్తి పన్నుతున్నది. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. మా మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుంది.

**– పాతర్లపాటి కృష్ణ, రైతు, వేపలగడ్డ, సుజాతనగర్**

## ధరణితో రైతులకు మేలు



రైతులు భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి మేలు చేశారు. గతంలో అధికారుల చుట్టూ తిరగలేక విసుగొచ్చేది. ఇప్పుడు భూమి కొనడం–అమ్మడం ఇట్టే జరుగుతున్నది. పహాణీ కావాలంటే ఆన్‌లైన్‌లో క్షణాల్లో తీసుకుంటున్నం. కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తాం అంటున్నారు. మళ్లీ పాత పద్ధతి వస్తే ఇబ్బందవుతుంది. ఎనుకటి లెక్క చేతితో రాసే పట్టాలయితే అవకతకలు జరుగుతయి. రైతులు ఆగమవుతరు.

**– పూనెం కృష్ణ, రామాంజిగూడెం గ్రామం, ఆళ్ళపల్లి మండలం**

## కాంగ్రెస్ వస్తే ఎదురుచూపులే



పొరపాటున కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే.. కరెంట్ కోసం రేయింబవళ్లు ఎదురుచూడాల్సిందే. గతంలో వారి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. తెలంగాణ వచ్చాక పంటలకు కరెంట్ సరిపోను ఉంటున్నది. సీఎం కేసీఆర్ సార్ దూరదృష్టితో కరెంట్ కష్టాలు పూర్తిగా పోయాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు చల్లగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వచ్చి అది చేస్తాం, ఇది చేస్తామని మాయమాటలు చెబుతున్నారు. వాటిని నమ్మితే మళ్లీ మోసపోతం. మూడు గంటల కరెంట్ ఇస్తే ఏ మూలన నీళ్లు పారుతాయి..? కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత రోజులే దాపురిస్తాయి. కేసీఆర్ సర్కారే మళ్లీ రావాలి.

**– తొండపు నరేష్ రెడ్డి, రైతు, టీ కొత్తగూడెం గ్రామం, పినపాక మండలం**

## 24 గంటల కరెంటుతో సాగు బాగుంది



24 గంటల కరంటుతో సాగు బాగుంది. కాంగ్రెస్ పాలనలో కరంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక రాత్రింబవళ్లు పొలాల్లోనే కాపురం చేసేవాళ్లం. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతో అవసరమైనప్పుడు మోటరు వేసుకుని విత్తన మొక్కజొన్న సాగు చేసుకుని గర్వంగా బతుకుతున్నాం. మా మద్దతు బీఆర్ఎస్‌కే.

**– గొల్లమందల శ్రీను, దమ్మపేట**

## ధరణితో నా భూమికి పూర్తి రక్షణ



ధరణితో నా భూమికి పూర్తి రక్షణ ఉంది. నా భూమి నా పేరు మీదనే ఉందా.. అని, గతంలో ఏటా మీసేవ కేంద్రాల్లో, రెవెన్యూ కార్యాలయాల్లో సరిచూసుకోవాల్సి వచ్చేది. ధరణితో ఏడాదికి రెండుసార్లు రైతుబంధు ఖాతాల్లో జమ అవుతోంది. రైతుబీమా భరోసాగా ఉంది. మా మద్దతు బీఆర్ఎస్‌కే.

**– వడిచేటి నాగలక్ష్మి, మల్లారం**

## కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి



తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది. రైతుల కోసం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌తో రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. రైతుబంధు, రైతుబీమా ధరణి వల్లే సాధ్యమైంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణి తీసివేస్తానని అంటున్నారు. ధరణి పోర్టల్ తీసేస్తే రైతులు చాలా కష్టాలు పాలవుతారు. ధరణి ఉండాలంటే మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుందాం.

**– దాక్షాయణి, పర్ణశాల గ్రామం**

## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కోతలే



తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. దీంతో రైతులకు పంటలు బాగా పండుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన చేసే రోజుల్లో కరెంట్ కోతలు ఎక్కువగా ఉండేవి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వస్తే రైతులకు మూడు గంటల ఉచిత విద్యుత్ మాత్రమే ఇస్తానని అంటున్నారు. పొలాలు ఎండిపోతాయి. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి.

**– తాటి వీరయ్య, తాటివారిగూడెం, పర్ణశాల**

## కాంగ్రెస్ వస్తే.. మళ్లీ కరెంటు కష్టాలే



రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. వ్యవసాయ, విద్యుత్ రంగాల మీద వాళ్లకు అవగాహన లేదనడానికి ఇదే నిదర్శనం. మూడు గంటల విద్యుత్ వల్ల ఒక్క మడి కూడా తడవదు. 10 హెచ్‌పీ మోటర్లను రైతులు భరించలేరు. అందరూ ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తే.. విద్యుత్ గ్రిడ్ మీద భారం పడుతుంది. అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. 24 గంటల విద్యుత్‌తో ఎవరికి అనుకూలించిన సమయంలో వాళ్లు వినియోగించుకుంటారు. రైతుకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటుంది. మా మద్దతు సీఎం కేసీఆర్ సార్‌కే.

**– తుర్రం శ్రీను, రైతు, తిమ్మంపేట, ములకలపల్లి మండలం**

## బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు



గత పాలకుల వల్ల అష్టకష్టాలు పడ్డ రైతులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో ఊరట చెందారు. పంటలకు మూడు గంటలు కరెంట్ వద్దు... 24 గంటలు కరెంట్ ఇచ్చే ప్రభుత్వమే కావాలి. బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి. నేను రెండున్నర ఎకరాల్లో మిర్చితోట వేశాను. కావాల్సినప్పుడల్లా తోటకు నీళ్లు కట్టి మంచిగా సాగు చేసుకుంటున్నాను. వరి పంటకు కూడా ఆరు తడులు కట్టేలా మాకు ఉచిత కరెంట్ ఇవ్వడంతో మేమంతా సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో మేంపడ్డ కష్టాలు చాలు... మళ్లీ ఆ నరకంలోకి వెళ్లలేం. బీఆర్ఎస్ వెంటే ఉంటాం.

**– ఓర్సు అయోధ్య, రైతు, నాయకులగూడెం, సుజాతనగర్**


## ధరణి వచ్చింది.. గొడవలు పోయినయ్



ధరణి పోర్టల్‌తో రెవెన్యూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరి భూములను ఎవరికి రాశారో తెలియదు. ఒక ఎకరం పట్టా భూమి పేరు కాస్తులో ఒకరు, పట్టాలో ఒకరు ఉండడంతో ఆ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ధరణి వచ్చాక అటువంటి సమస్యలేవీ లేవు. ఒక వ్యక్తికి ఒకే పాస్ పుస్తకం ఇచ్చారు. ధరణిని రద్దు చేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. గ్రామాల్లో గొడవలు పెరుగుతాయి.

**– గీగా సుబ్బమ్మ, అనంతారం గ్రామం, అశ్వారావుపేట మండలం**


## ధరణి చాలా బాగుంది



గతంలో భుములు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే దళారులకు డబ్బులివ్వాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ధరణి తీసుకురావడంతో తిప్పలు తప్పినయ్. నేను మూడేండ్ల కిందట నా భూమిని పట్టా చేయించుకున్నాను. పదిరోజుల్లో పట్టా పుస్తకం నా చేతికి వచ్చింది. ప్రస్తుతం ఉన్న ధరణి వ్యవస్థ చాలా బాగుంది. దీన్ని తీసేస్తే రైతులు గోసపడక తప్పదు. రైతుబంధు కూడా ఆగిపోతుంది.కాంగ్రెస్ వచ్చుడు లేదు.. సచ్చుడు లేదు. రైతుల గురించి నిరంతరం ఆలోచిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికే మా మద్దతు.

**– సొబ్బని సూర్యం, రైతు, కాకర్ల, జూలూరుపాడు**

## ఇక్కడ కరెంటు దేశానికే ఆదర్శం..



తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతులకు ఇస్తున్న ఉచిత కరెంటు దేశానికే ఆదర్శంగా ఉంది. ఇతర రాష్ట్రాల్లో 5 గంటలకు మించి కరెంటు అందడం లేదు. వానకాలంలో కరెంటు కష్టాలు మొదలవుతున్నాయి. కాని తెలంగాణలో వర్షాలు పడ్డా కరెంటు నిరంతరాయంగా ఉంటుంది. గతంలో రోజుకు 8 గంటలు కరెంటు వస్తే గొప్ప విషయం. వ్యాపారస్తులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. తెలంగాణ వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ ఇస్తున్న ఉచిత కరెంటుతో వ్యవసాయం పండుగలా మారింది. పేద, మధ్య, వ్యాపార, వాణిజ్య తదితర రంగాల వారు ఎంతో అభివృద్ధిని సాధించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో ఉంది. మరోమారు సంక్షేమ పథకాలు అమలుకావాలంటే సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. నా ఓటు కారుకే.

**– కుంజా వెంకయ్య**